వాయిస్ టుడే

హైదరాబాద్
ఆదివారం, 23 జూన్ 2024






# జర్నలిస్టుల హక్కులకూ చట్టం కావాలి

**అధ్యయనం, ప్రజాచైతన్య వార్తలు మరిన్ని రావాలి**
**-ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూనే...**
**-జనం సమస్యల పరిష్కారంకై కలానికి పని చెప్పాలి**
**-జర్నలిస్టులంతా సంఘటితంగా హక్కులు సాధించుకోవాలి**
**-టీడబ్ల్యూజేఎఫ్ కరీంనగర్ జిల్లా సమావేశంలో వక్తలు**
**-అట్టహాసంగా నగరంలో ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవం**

కరీంనగర్, మహానది బ్యూరో,జూన్ 22: కార్మికులు మొదలుకొని ఆయా రంగాల్లో పని చేసే ఉద్యోగులందరికీ ఉన్న చట్టాల మాదిరిగానే జర్నలిస్టులకూ హక్కులు కల్పించేలా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలూ అందేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూనే, జనం సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యంలో ప్రధాన భూమిక పోషిస్తున్న జర్నలిస్టులు తమ హక్కుల కోసం సంఘటితంగా ఉండాలని అన్నారు. నిరంతర అధ్యయనం, ప్రజా చైతన్య కథనాలు అందిస్తూ సమాజశ్రేయస్సుల్లో తమకంటూ స్థానం పొందాలని పలువురు వక్తలు సూచించారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌ను వివిధ రాజకీయపార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జాతీయనాయకులు కలిసి జ్యోతిప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వచ్చిన కరీం'నగర' మేయర్ వై.సునిల్‌రావు మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌కు అవసరమైన సౌకర్యాల కల్పనలో తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. తాను విద్యార్థి నాయకునిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించినప్పటి నుంచి మీడియా ప్రాధాన్యత, వారి అవసరం ఎంతగానో ఉందని నమ్ముతానని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థల్లో ప్రజలకందించే సేవల్లో మీడియా కూడా నాలుగో స్తంభంగా ఉంటుందన్నారు. అనంతరం ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల పేరుతో కొందరు ఇతర రంగాల్లో పని చేసే ఉద్యోగులు, వ్యాపారస్తులు అక్రిడిటేషన్‌కార్డులు పొందుతున్నారని, వారందరవీ రద్దు చేయించి, భవిష్యత్‌లో అనర్హులకు రాకుండా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులను కోరారు. నిజమైన జర్నలిస్టులు, ఫీల్డ్ మీద ఉంటూ నిరంతరం వార్తలు సేకరించే జర్నలిస్టుల్లో కొంతమందికి సంక్షేమాల్లో అన్యాయం జరుగుతోందని, వీటిపైనా పోరాడాలని, అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంతో జర్నలిస్టుల సమస్యల చర్చావేదికలకు, వారి సమావేశాలకు మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మాట్లాడుతూ...తమ గోడును వెళ్లబోసుకునేందుకు ప్రెస్ క్లబ్ కు వచ్చే బాధితులకు విలేకరులు అండగా నిలిచి వారి పక్షాన వార్తలు అందించాలని అన్నారు. ఇతర మీడియా పత్రికలు చదవాలని, ఒక టీవీ సైతం ఏర్పాటు చేసుకుని చానెళ్ల ద్వారా నిరంతర వార్తకథనాలనూ పరిశీలించాలని ఆయన సూచించారు. జర్నలిస్టుల ఇండ్ల సమస్యతో పాటు పలు ఇతర సమస్యలను నూతన ప్రభుత్వానికి ఇప్పటికే విన్నవించామని, ప్రభుత్వం ఏర్పడి ఆర్నెళ్లు మాత్రమే గడుస్తుండటంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు కొంత విరామం ఇచ్చామని, రాబోయే రోజుల్లో స్పందించని పక్షంలో ఉద్యమాలు చేపడతామని అన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ మహాసభలు పూర్తిచేసి హక్కుల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు నిరంతర అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనిఅన్నారు. నేతలు చెప్పే ప్రసంగాలు, వారి ప్రకటన ప్రచురణేకాకుండా వాటి వెనుక ఉన్న మర్మం, జనహితమైనవా? కావా? అన్న కోణంలోనూ వార్తాకథనాల రచన మరింత పెరగాలన్నారు. ప్రస్తుతంలో రాష్ట్రంలోని ప్రభుత్వం రాబోయే రోజుల్లో అక్రిడిటేషన్ సంఖ్యను కుదించాలనే ఆలోచన చేస్తోందని, దీన్ని జర్నలిస్టులంతా సంఘటితంగా అడ్డుకుని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కరీంనగర్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేసిన సంఘం సభ్యులను అభినందించారు. అనంతరం ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ... సభ ప్రారంభోత్సవానికి వచ్చిన పాలక, ప్రతిపక్ష నాయకులను ఇక్కడి ప్రెస్‌క్లబ్‌కు శాశ్వత స్థలంలో భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఫెడరేషన్ సభ్యులు, కార్యవర్గంతో సమావేశమై భవిష్యత్ కార్యచరణపై రాష్ట్ర, జాతీయ నాయకులు చర్చించారు. ఈ ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవంలో టీడబ్ల్యూఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, సీపీఐ నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి,మాజీ జడ్‌పీటీసీ జోగిరెడ్డి, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండోజు శ్రీకాంత్ సహా హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షులు యోహాన్, జిల్లా, డివిజన్ కమిటీ సభ్యులు, భానుచందర్, రవికృష్ణ, రఫీక్, గణేష్, వెంకటరమణ, రాజు, సంతోష్, ఖాజాఖాన్, శ్రీcవాస్, శ్రీరాములు, నవీన్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, రామరాజు, ఎల్లస్వామి సహా వివిధ మండలాల నుంచి దాదాపు వంద మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సినిమా వాయిస్



## నా పనే నన్ను ముందుకు నడిపిస్తోంది!

సవాలు విసిరే పాత్రలతో ప్రయాణం చేస్తుంది బాలీవుడ్ నాయిక కృతి సనన్. ఇటీవలే విడుదలైన 'క్రూ'లో తన నటనతో ప్రేక్షకులను మెప్పించిందీమె. నటిగానే కాకుండా నిర్మాతగా కూడా తన ప్రతిభను నిరూపించుకోవడానికి సిద్ధమవుతోంది ఈ భామ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి.. తను చేస్తున్న పనే తనను ముందుకు నడిపిస్తోందంటూ కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. "నేను ఏ పని చేసినా.. వృత్తిపరంగా, వ్యక్తిగతంగానైనా అంకితభావంతో ఉంటాను. అందుకే ఎంచుకున్న ప్రతి సినిమాతో అభిమానులకు మరింత దగ్గరై విజయాలను అందుకుంటున్నాను. ఈ పదేళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను, ఎదురైన అవమానాలను అధిగమించి.. నాలో ఉత్సాహాన్ని పెంచే పనిపై దృష్టి పెట్టడం మొదలుపెట్టాను. ఇప్పుడదే నన్ను ముందుకు నడిపిస్తుంద"ని చెప్పుకొచ్చింది.

## తెలంగాణలో 'కల్కి' సినిమా టికెట్ ధరల పెంపునకు గ్రీన్‌సిగ్నల్




ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన 'కల్కి 2898 ఏడీ' సినిమా టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నెల 27 నుంచి జులై 4 వరకు 8 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఇటీవల టికెట్ ధరల పెంపు, అదనపు షోలకు అనుమతి కోరుతూ వైజయంతీ మూవీస్ దరఖాస్తు చేసుకుంది. ఈక్రమంలో తెలంగాణ ప్రభుత్వం 'కల్కి 2898 ఏడీ' చిత్ర టికెట్‌పై గరిష్ఠంగా రూ.200 పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.75, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 వరకు పెంచుకోవచ్చని పేర్కొంది. దీంతో పాటు ఈ నెల 27న ఉదయం 5.30 గంటల షోకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వారం రోజుల పాటు ఐదు షోలు నిర్వహించేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ 'కల్కి' టికెట్ ధరలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'.. సిద్ధం




'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్'తో థియేటర్లలో సందడి చేయనున్నారు తమిళ కథానాయకుడు విజయ్. ఆయన ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రాన్ని వెంకట్ ప్రభు తెరకెక్కించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. శనివారం విజయ్ 50వ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. దాదాపు నిమిషం నిడివి ఉన్న ఈ ప్రచార చిత్రంలో ఓ ఛేజింగ్ సీక్వెన్స్‌ను చూపించారు. ఆఖర్లో విజయ్ తండ్రీ కొడుకులుగా బైక్‌పై ఫైరింగ్ చేస్తూ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. సైన్స్ ఫిక్షన్ అంశాలతో నిండిన ఓ ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు తెలిసింది. ఇది సెప్టెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి యువన్ శంకర్ రాజా సంగీతమందిస్తున్నారు.

## తండేల్ జోరు



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి తెరకెక్కిస్తున్న చిత్రం 'తండేల్'. బన్నీవాస్ నిర్మిస్తున్న ఈ సినిమాని అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం వైజాగ్, శ్రీకాకుళంలో ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం శనివారం ప్రకటించింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా చైతూ, సాయిపల్లవిపై ముఖ్య సన్నివేశాలు తెరకెక్కించినట్లు తెలిపింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథతో రూపొందుతోన్న ఈ సినిమాలో చైతన్య, సాయిపల్లవి డీగ్లామర్ పాత్రల్లో కనిపించనున్నారు. తొలిసారి ఉత్తరాంధ్ర యాసలో సంభాషణలు వినిపించనున్నారు.

## ఫార్మా ప్రపంచంలోని రహస్యాలు



మరాఠీ, హిందీ పరిశ్రమల్లో నటుడిగా, దర్శకనిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయకుడు రితేష్ దేశ్‌ముఖ్.. త్వరలో 'పిల్' అనే తన తొలి వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతున్నారు. రాజ్ కుమార్ గుప్తా దీన్ని రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్‌ను ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను పంచుకున్నారు రితేష్. "మీరు వినియోగిస్తున్న మెడిసిన్ దేనితో తయారు చేస్తున్నారో తెలుసా..? దానికి సంబంధించిన నిజానిజాల్ని జులై 12న రాబోతున్న 'పిల్' సిరీస్‌తో తెలుసుకోవడానికి సిద్ధంగా ఉండండి" అని వ్యాఖ్యల్ని జోడించారు. ఫార్మా ప్రపంచంలో దాగున్న రహస్యాలు, చీకటి కోణాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం 'రైడ్ 2', 'కాకుడా' చిత్రాలతో బిజీగా ఉన్నారు రితేష్.

## డాన్సులో కొట్టేదేవరని?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ డైరెక్షన్‌లో ఈ మూవీ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'దేవర'లో ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ కొరియోగ్రఫీ చేయనున్న కొత్త పాట చిత్రీకరణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది. "పఠాన్, వార్, ఫైటర్" వంటి చిత్రాల్లో అద్భుతమైన స్టెప్స్‌ను కంపోజ్ చేసిన కొరియోగ్రాఫర్‌గా బాస్కో మార్టిస్‌కు మంచి క్రేజ్ ఉంది. ఇప్పుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ "దేవర" చిత్రానికి పని చేస్తుండటంపై బాస్కో ఎగ్జయిట్ అయ్యారు. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోను షేర్ చేయటం ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.